సాక్షి
కర్నూలు
సోమవారం, 21, ఆగస్టు, 2023



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం భక్తులతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు రద్దీగా కనిపించాయి.



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని నిత్యకళావేదికపై ఆదివారం శ్రీశైలానికి చెందిన నటరాజ నృత్యకళాశాల బృంద సభ్యులు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు.

న్యూస్‌రీల్

ఉరుకుందలో ప్రత్యేక పూజలు



కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం 7గంటల నుంచే క్యూలైన్‌లో నిలుచున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయ అధికారులు ప్రత్యేక దర్శనంతో పాటు శీఘ్ర , అతి శీఘ్ర, ఉచిత, వీఐపీ దర్శన సౌకర్యం కల్పించారు. ఆలయ పరిసరాల్లో ఎటుచూసిన భక్తులు కనిపించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి నైవేద్యం సమర్పించారు.

నేడు జెడ్పీలో 'స్పందన'

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా పరిషత్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, డివిజన్ స్థాయిల్లోనూ స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

8 మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. కృష్ణగిరిలో 8.4 మి.మీ., పెద్దకడుబూరులో 7.4, ఎమ్మిగనూరులో 5.8, వెల్దుర్తిలో 1.4, ఓర్వకల్లులో 1.2, చిప్పగిరిలో 1.2, కోడుమూరులో 1.0, మద్దికెరలో 0.6 మిమీ ప్రకారం వర్షం కురిసింది. జిల్లా మొత్తం మీద సగటున 1.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మిమీ ఉండగా.. ఇప్పటి వరకు 21.5 మి.మీ. వర్షం మాత్రమే నమోదైంది.

అభివృద్ధిపై నేడు సమీక్ష

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మున్సిపల్ సమావేశ భవనంలో సోమవారం జిల్లా కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యేలు చెన్నకేశవ రెడ్డి, బాలనాగిరెడ్డి, పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

వలంటీర్ల భర్తీకి నేడు నోటిఫికేషన్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 199 గ్రామ, వార్డు వలంటీర్ల నియామకాలకు సంబంధించి సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 123 గ్రామ, 76 వార్డు వలంటీర్లను భర్తీ చేసేందుకు ఈ నెల 22 నుంచి 24వ తేది వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. 25న దరఖాస్తుల పరిశీలన, 26న మౌఖిక పరీక్ష, 28న ఎంపికైన వలంటీర్ల వివరాలను తెలియజేస్తామన్నారు. 30వ తేదీన ఎంపికైన వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, 31న వారు విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ అధికారులను సంప్రదించాలని సీఈఓ కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ హర్షణీయం

కర్నూలు సిటీ: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ఆర్థిక కార్యదర్శి అబ్దుల్ జబ్బర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేస్తున్న సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట మేరకు ఫైల్‌పై సంతకం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న ఐదు రోజుల్లోనే కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను రూ.27 వేల నుంచి రూ.37 వేలకు పెంచారన్నారు. 2019 సంవత్సరానికి ముందు వరకు 10 నెలల వేతనం మాత్రమే ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 12 నెలల వేతనం ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటిసారి విద్యాశాఖ పరిధిలో కాంట్రాక్టు ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేశారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసిన ఘనత సీఎం జగన్‌దేనని పేర్కొన్నారు.

ఎన్నిక ఏదైనా.. అదే తీర్పు

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులదే గెలుపు
- పంచాయతీ ఉపఎన్నికల్లోనూ అవే ఫలితాలు
- అధికార పార్టీ మద్దతుదారులకు పట్టం కట్టిన ప్రజలు
- ఒక సర్పంచుతో పాటు 29 వార్డులు కైవసం
- సంక్షేమం పథకాలే విజయ సోపానాలు



విజయానందం: వార్డు స్థానాల్లో గెలిచిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులతో మంత్రి గుమ్మనూరు

కర్నూలు(అర్బన్): ఎన్నిక ఏదైనా ప్రజలు చెక్కు చెదరకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కడుతున్నారు. ఓటుతో ఆమోదముద్ర వేస్తూ ఎప్పటికప్పుడు అధికార పార్టీని బలపరుస్తున్నారు. ప్రతిపక్ష టీడీపీ, బీజేపీ, జనసేన, సీపీఎం, సీపీఐ నాయకుల విమర్శలను తిప్పికొడతున్నారు. పంచాయతీ ఉప ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రతిపక్ష పార్టీలకు చెంపపెట్టులా మారింది. కర్నూలు జిల్లాలో ఒక సర్పంచు, 42 వార్డులకు ఎన్నికలు జరగ్గా, సర్పంచుతో పాటు 29 వార్డులను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు చేజిక్కించుకున్నారు. టీడీపీ 12 స్థానాలతో సరిపెట్టుకోగా సీపీఎం ఒక స్థానంలో ఏకగ్రీవంతో గట్టెక్కింది.

అధికార పార్టీకే జనం మద్దతు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎన్నికల్లో విజయ సోపానాలుగా నిలుస్తున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే, ప్రజల అవసరాలను తీర్చేందుకు అనేక పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోంది. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ మంచి ఫలితాలను ఇస్తోంది. అలాగే 'నవరత్నాల' పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల అభిమానాన్ని పొందాయి. దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్ పాలనపై ప్రజల్లో నమ్మకం రెట్టింపవుతోంది.

టీడీపీకి చెంపపెట్టు

- మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: పంచాయతీ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆలూరు నియోజకవర్గంలో 9 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పంచాయతీవార్డు సభ్యులుగా ఎన్నిక కాగా.. వారందరినీ తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మంత్రి ప్రత్యేకంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ, విదేశాల్లో ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. ఎవరి సిఫార్సు లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, దీంతో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. దీనిని జీర్ణించుకోలేని టీడీపీ పచ్చ మీడియాతో కలసి విష ప్రచారం చేస్తోందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగకపోతే ఓటర్లు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఎలా తీర్పు ఇస్తారని మంత్రి ప్రశ్నించారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో టీడీపీని రాష్ట్రం నుంచి ప్రజలు తరిమి కొట్టడం ఖాయమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యక్తిగతంగా దూషణలు చేయడం మానుకుని హుందాతనాన్ని ప్రదర్శించాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, వివిధ మండలాలకు చెందిన కన్వీనర్లు వీరేష్, మల్లికార్జున, పెద్దయ్య, షఫీఉల్లా, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

గత ఎన్నికలను పరిశీలిస్తే...

2021లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఊహించని రీతిలో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించింది. మొత్తం 970 గ్రామ పంచాయతీల్లో 754 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా అవే ఫలితాలు పునరావృతమయ్యాయి. మొత్తం 53 జెడ్పీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కైవసం చేసుకోగా, 796 ఎంపీటీసీ స్థానాల్లో 672 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించారు. మునుపెన్నడు లేని విధంగా జిల్లా పరిషత్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థుల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా గెలవకపోవడంతో జెడ్పీ పాలకవర్గమంతా వైఎస్సార్‌సీపీ మయమై పోయింది. అలాగే అన్ని మండల పరిషత్తుల్లో కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యింది. ఈ నేపథ్యంలోనే జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా పల్లె ఓటరుతో పాటు పట్టణ ఓటర్లు కూడా వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టారు. కర్నూలు నగర పాలక సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు, ఆళ్లగడ్డ, డోన్, బేతంచెర్ల మున్సిపాలిటీల్లో కూడా వైఎస్సార్‌సీపీకి ప్రజలు తిరుగులేని విజయాన్ని అందించారు.

సర్పంచ్ స్థానాల ఎన్నికల ఫలితాలు

నియోజకవర్గం	ఎన్నికలు జరిగిన సర్పంచ్ స్థానాలు	గెలిచిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు	గెలిచిన టీడీపీ మద్దతుదారులు
మంత్రాలయం	1	1	0

వార్డు మెంబర్ల ఎన్నికల ఫలితాలు

నియోజకవర్గం	ఎన్నికలు జరిగిన వార్డుల సంఖ్య	గెలిచిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు		గెలిచిన టీడీపీ మద్దతుదారులు		ఇతరులు
		ఏకగ్రీవం	గెలుపు	ఏకగ్రీవం	గెలుపు	
కోడుమూరు	9	5	2	1	1	0
ఆలూరు	11	8	1	1	1	0
మంత్రాలయం	7	3	3	1	0	0
ఎమ్మిగనూరు	2	0	0	2	0	0
పత్తికొండ	4	2	1	0	1	0
ఆదోని	2	0	0	0	2	0
పాణ్యం	7	3	2	0	1	1

ఉప సం'గ్రామం'లో సడలని సత్తా



మాలపెద్ద నర్సప్ప, బదినేహాల్ సర్పంచ్

ఈ నెల 19వ తేదీన జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకే ప్రజలు పట్టం కట్టారు. కర్నూలు జిల్లాలో ఒక సర్పంచు, 42 వార్డులకు ఎన్నికలు జరగ్గా, సర్పంచుతో పాటు 29 వార్డులను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు చేజిక్కించుకున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీకి చావుదెబ్బ తగిలింది. ఈ నియోజకవర్గంలో ఒక సర్పంచ్, 7 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. సర్పంచ్‌తోపాటు 6 వార్డు స్థానాలను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. టీడీపీ ఏకగ్రీవంతో ఒక వార్డు స్థానంలో ఉనికి చాటుకుంది. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో ఏడు వార్డుల్లో ఉప ఎన్నికలు నిర్వహించగా ఐదు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయభేరి మోగించారు. ఆలూరులో మొత్తం 11 వార్డు స్థానాలకు గాను 9స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు. కోడుమూరులోనూ తొమ్మిది స్థానాలకుగాను ఐదింటిలో గెలుపుసాధించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రెండు వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. టీడీపీ అభ్యర్థులుగా గెలుపొందిన వారు మృతి చెందడంతో మానవతా దృక్పథంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బరిలో నిలబడలేదు. ఆదోనిలో రెండు వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా.. ఒక వార్డులో వైఎస్సార్‌సీపీ పోటీ చేయలేదు.



కర్నూలులో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

జిల్లా వ్యాప్తంగా ఆదివారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లోని నాగమయ్య కట్టలకు, పుట్టలకు నువ్వుల పిండి, కొబ్బెర బెల్లం నైవేద్యంగా సమర్పించారు. పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వధూవరులు నాగుల కట్టల చుట్టూ ప్రదక్షణలు చేశారు. శ్రావణ మాసంలో మొదటి పర్వదినం కావడంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిట లాడాయి. - కర్నూలు కల్చరల్

22 నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లోని సచివాలయాల పరిధిలో ఈ నెల 22, 23, 25వ తేదీల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు తప్పనిసరిగా కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి పంపించాల్సి ఉందన్నారు. జిల్లాలో 96 ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, ఈ కేంద్రాల ద్వారా అన్ని మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాల్లో నమోదుకు ఏర్పాట్లు చేశామన్నారు. కొత్తగా ఆధార్ నమోదు చేయడం, ఆధార్ నమోదు పూర్తి అయినా, కార్డు లేకపోవడం, 0 నుంచి 5 సంవత్సరాలు, 5 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల లోపు బాల బాలికలు ఈ ఆధార్ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇంటి చిరునామా, మొబైల్ నెంబర్, ఫోటో మార్పు, వేలి ముద్రలు, బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.10 కోట్లతో టమాట ప్రాసెసింగ్ యూనిట్

- పత్తికొండలో 3.50 ఎకరాల భూమి గుర్తింపు
- ఇప్పటికే మిషనరీలకు సంబంధించి డీపీఆర్ సిద్ధం
- సెప్టెంబర్ నెలాఖరు లోపు భూమి పూజకు ఏర్పాట్లు



పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమిని పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి (ఫైల్)


కర్నూలు(అగ్రికల్చర్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. దీని నిర్మాణానికి సెప్టెంబరు నెలాఖరులోగా భూమి పూజ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పాలనేది దాదాపు మూడు దశాబ్దాల కల. పత్తికొండ, దేవనకొండ, ఆస్పరి, పెద్దకడబూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, ఓర్వకల్లు, ఆదోని, కోడుమూరు, కోసిగి, గోనెగండ్ల తదితర మండలాల్లో దాదాపు 15 వేల ఎకరాల్లో టమాట సాగవుతోంది. 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు టమాట ప్రాసెసింగ్ యూనిట్ గురించి పట్టించుకోలేదు. పైగా వ్యవసాయాన్ని దండగ అంటూ హేళన చేశారు. టమాట రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రూ.10 కోట్ల వ్యయంతో ఇది ఏర్పాటు కానుంది.

3.50 ఎకరాల భూమి గుర్తింపు

టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం పత్తికొండ సమీపంలో 3.50 ఎకరాల భూమిని గుర్తించారు. ఈ భూమిని ఇటీవల జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి పరిశీలించారు. భూమిని కేటాయించేందుకు జేసీ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మిషనరీలకు సంబంధించి డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) సిద్ధమైంది. ఈ భూమి ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి అప్పగించిన తర్వాత నిర్మాణాలకు సంబంధించి భూమి పూజ కార్యక్రమం చేపడతారు. ఇందులో టమాట ప్రాసెసింగ్‌కు పెద్దపీట వేస్తారు. రైతుల దగ్గర టమాట లేనప్పుడు జామ, బొప్పాయి, సపోట తదితర పండ్ల ప్రాసెసింగ్ కూడా చేపడతారు. ఇతర జిల్లాల నుంచి కూడా టమాట దిగుమతి చేసుకుంటారు. ఏడాది పొడవునా యూనిట్ పనిచేయాలనేది లక్ష్యం. సెప్టెంబరు నెలాఖరులోపు భూమి పూజ నిర్వహించిన తర్వాత భవనాల పనులు, మిషనరీలు ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడతామని అధికారులు తెలిపారు. ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్యంతో ఈ యూనిట్ ఏర్పాటు కానుంది. జిల్లాలో ఈ ఏడాది టమాట సాగు కూడా పెరుగుతోంది. ట్రెల్లీస్ విధానంలో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అవుతుండటం, విజిటబుల్ సోలార్ డ్రైయర్ల ద్వారా ఫ్లేక్స్ తయారీ చేస్తుండటంతో టమాట రైతుకు మంచి రోజులు వచ్చాయి.

'హరిదాస' దర్శనం..ఆధ్యాత్మిక జ్ఞానం

- రూ.3కోట్లతో హరిదాస దర్శిని మ్యూజియం ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న కళాఖండాలు
- నాలుగు భాషల్లో వివరాలు
- ప్రత్యేక అనుభూతి పొందుతున్న భక్తులు




నైవేద్య సమర్పణ పరమార్థాన్ని వివరించే ప్రతిమలు



సకల దేవతల స్వరూపిణి గోమాత విగ్రహం



శిలా ఖండాలు తిలకిస్తున్న భక్తులు



మంత్రాలయం: శ్రీవేద వ్యాసుడి జనన రహస్యం.. వైకుంఠ లోక వైభవం.. నైవేద్య సమర్పణ సంవిధానం.. శ్రీవిష్ణు పాద ముద్రిక పరమార్థం..దేహమే దేవాలయం నిగూఢాన్ని తెలుసుకోవాలంటే 'హరిదాస దర్శిని' ని సందర్శించాల్సిందే. మానుషోత్తములు, అజానజదేవతలు, దేవగంధర్వులు, మనుష్య గంధర్వులు, మనుష్యరాజులు ఎవరో కూడా బోధ పడుతోంది. ధ్యాన శాస్త్ర సోపానాలు, ఆధ్యాత్మిక చింతన గొప్పతనాన్ని స్పృశించిన కళాఖండాలు ఇక్కడ మనసును కట్టిపడేస్తాయి. వేదాలను, ఇతిహాసాలను శోధించి, సమీకరించి మ్యూజియం రూపొందించారు. ఎంతో ఓర్పుతో సరళంగా, క్లుప్తంగా అందరికీ అర్థమయ్యేలా నాలుగు భాషల్లో కళారూపాల ప్రశస్తిని అందులో ముద్రించి భక్తులకు విజ్ఞానాన్ని పంచుతున్నారు. భక్తులు సైతం మ్యూజియాన్ని సందర్శించి పరమార్థాలను తెలుసుకుంటున్నారు. ప్రముఖ మంత్రాలయం పుణ్యక్షేత్రంలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన 'హరిదాస దర్శిని' మ్యూజియం విశేషాలు తెలుసుకుందాం.

ప్రత్యేకతలు ఇవే..

భక్తుల ఆధ్యాత్మికత అవగాహన కోసం శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మ్యూజియం ఏర్పాటు చేయించారు. శ్రీమఠం ఉత్తర ముఖద్వారానికి అభిముఖంగా రంగసభాంగణ భవనంలో ఈ హరిదాస దర్శిని మ్యూజియం రూపొందించారు. అందులో క్లుప్తంగా భక్తులకు అర్థమయ్యేలా కళాఖండాలు, ముద్రణలు నెలకొల్పారు. మ్యూజియంలోకి అడుగు పెట్టిన వెంటనే భక్తులకు ఎదురుగా విష్ణుమూర్తి పాదదర్శనం కల్గుతుంది. శ్రీహరి చరణ విశిష్టతను స్పృశించేలా పాదముద్రిక స్థానాలను అందులో గుర్తిస్తూ విగ్రహం నెలకొల్పారు. కుడి దిశగా హయగ్రీవమూర్తి, విగ్రహం, చుట్టూర చరితను వివరించే చిత్రాలు అమర్చారు. దారి పొడవునా వేదవ్యాసుడు, సరస్వతి, విఘ్నరాజు, వరాహమూర్తి, ధన్వంతరి, కపిల మహర్షి, దత్తాత్రేయుడు, నారసింహస్వామి, శ్రీరామ చంద్రుడు, శ్రీకృష్ణ భగవానుడు, శ్రీకరుడు విగ్రహాలు ప్రతిష్ఠించి విశిష్టతను వివరించే డిజిటల్ పట్టికలు ఉంచారు. గంధర్వులు, మునులు, రుషులు, ప్రఖ్యాత రాజులు చరితలను పొందుపరిచారు. మ్యూజియం మధ్య భాగంలో ఉన్న సోపానాలకు స్వర శాస్త్రాన్ని స్పృశించేలా వాయు తత్వములు, స్థానాలు, అధిపతుల వివరాలతో మెట్టు మెట్టుకు లిఖించారు. మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా మెట్ల అమరిక ఉంది. గోమాత విగ్రహం, రాఘవేంద్రుల బృందావన ప్రతిమ, అవతార మూర్తుల పరంపర, నైవేద్య సమర్పణ విధాన విగ్రహం, వైకుంఠ లోకం నమూనా కళాఖండాలు మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భక్తుల హర్షం

మ్యూజియం ఏర్పాటు చేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాతిక రహస్యాలను వివరించిన లిఖిత విధానం, నాలుగు భాషల్లో లిపి ఉండడం, ఆకట్టుకునేలా సరళంగా అర్థమయ్యేలా కళాఖండాలు రూపొందించడంపై అభినందనలు తెలుపుతున్నారు. భక్తుల కోలాహలంతో మ్యూజియం కళకళలాడుతోంది. ఇక్కడ సెల్‌ఫోన్లు అనుమతించరు. భక్తుల సందర్శించాల్సిన ప్రదేశాల్లో ఇదొకటి.

స్వామీజీ చొరవతోనే



శ్రీమఠం పీఠాధిపతుల చొరవతోనే ఈ మ్యూజియం ఏర్పాటు చేశాం. రూ.3 కోట్లు వెచ్చించి హరిదాస దర్శిని నిర్మించాం. భక్తులకు ఆధ్యాత్మిక అవగాహన కల్పించాలన్న సదుద్దేశంతో పీఠాధిపతులు ఈ నిర్ణయం తీసుకున్నారు. భక్తులు సైతం మ్యూజియం ఏర్పాటుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దర్శినిలోని కళాఖండాలను భక్తులను ఆకట్టుకుంటున్నాయి.– ఎల్. మాధవశెట్టి, ఏఏవో

క్లుప్తంగా

కొనసాగుతున్న వజ్రాన్వేషణ



జొన్నగిరి వద్ద వజ్రాన్వేషణ చేస్తున్న జనం

తుగ్గలి: ఒక్క వజ్రం దొరికితే చాలు తమ కష్టాలు తీరుతాయని జనం ఆశ. అందు కోసం ఎంతో ఆశతో వజ్రాన్వేషణ చేస్తున్నారు. జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో వజ్రాలు లభ్యమవుతుంటాయి. దీంతో వివిధ ప్రాంతాల నుంచి జనం ఇక్కడికి వచ్చి వజ్రాన్వేషణ చేస్తుంటారు. ఆదివారం కావడంతో పిల్లా పాపలతో వచ్చి జొన్నగిరి వద్ద ఓ పొలంలో గుంపులు గుంపులుగా చేరి జనం వజ్రాల కోసం వెతుకుతూ కనిపించారు.

అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో కృష్ణగిరి విద్యార్థి ప్రతిభ



బంగారు పతకం పొందిన తేజేశ్వర్

కర్నూలు సిటీ: పోలాండ్‌లో ఈ నెల 10 నుంచి 20వ తేదీ(ఆదివారం) వరకు నిర్వహించిన అస్ట్రానమి అండ్ అస్ట్రోఫిజిక్స్ అంతర్జాతీయ ఒలింపియాడ్ పోటీల్లో కృష్ణగిరికి చెందిన విద్యార్థి తేజేశ్వర్ ప్రతిభ కనబరిచాడు. మొత్తం 56 దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, ఇందులో భారత దేశం తరఫున పాల్గొన్న విద్యార్థుల్లో తేజేశ్వర్ బంగారు పతకాన్ని సాధించాడు. ఉపాధ్యాయులు కోడూరు శేఖర్, కృష్ణవేణి దంపతుల కుమారుడు కోడూరు తేజేశ్వర్ ప్రస్తుతం వియజవాడలో ఓ కాలేజీలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. భవిష్యత్తులో మంచి ర్యాంకుతో ఐఐటీలో చదివాలని ఉందని తెలిపారు.

ఎస్ఆర్ పోస్టుల భర్తీకి నేడు ఇంటర్వ్యూలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్ (ఎస్ఆర్) పోస్టులను భర్తీ చేసేందుకు సోమవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 38 పోస్టులకు గాను ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. గైనకాలజీ 1, రేడియాలజీ 3, రేడియోథెరపీ 1, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ 1, అనాటమీ 5, ఫిజియాలజీ 2, బయోకెమిస్ట్రీ 2, ఫార్మకాలజీ 3, మైక్రోబయాలజీ 3, ఫోరెన్సిక్ మెడిసిన్ 4, కమ్యూనిటి మెడిసిన్ 1, కార్డియాలజీ 1, ఎండోక్రైనాలజీ 1, గ్యాస్ట్రో ఎంట్రాలజీ 1, న్యూరాలజీ 1, సీటీవీఎస్ 1, ప్లాస్టిక్ సర్జరీ 1, పీడియాట్రిక్ సర్జరీ 1, యురాలజీ 1, న్యూరోసర్జరి 1, నెఫ్రాలజీ 1, సర్జికల్ ఆంకాలజీ 1, మెడికల్ ఆంకాలజీ 1 పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో పీజీ చదివిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఇతర వివరాలకు www.kurnoolmedicalcollege.ac.inలో వీక్షించాలని సూచించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,627.54
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:85.113
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:706
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,207

వైద్య విద్యా ప్రాప్తిరస్తు..

- తుది దశకు చేరుకున్న నంద్యాల వైద్య కళాశాల నిర్మాణం
- 150 సీట్లతో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభానికి సర్వం సిద్ధం
- ఇప్పటికే అన్నీ విభాగాల్లో పూర్తయిన బోధన సిబ్బంది నియామకం
- కొనసాగుతున్న ప్రవేశాల ప్రక్రియ
- మొదటి విడత కౌన్సెలింగ్‌లో 64 మందికి సీట్లు



అత్యాధునిక సౌకర్యాలతో బోధనా తరగతి



బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లో పరీక్షలకు సిద్ధమైన పరికరాలు

నంద్యాలటౌన్: జిల్లా ప్రజల చిరకాల స్వప్నం అతి త్వరలో సాకారం కాబోతుంది. జిల్లా కేంద్రమైన నంద్యాలలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభానికి సర్వం సిద్ధమవుతోంది. అన్ని హంగులతో వైద్య కళాశాల ముస్తాబవుతోంది. దాదాపు 95 శాతం పనులు పూర్తవగా తుది మెరుగులు దిద్దుకుంటోంది. సెప్టెంబర్ మాసం నుంచి తరగతులు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతుంది. నంద్యాలలో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించాలనే డిమాండ్ జిల్లా వాసుల్లో దశాబ్దాల కాలం నుంచి ఉన్నా, గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులో తెచ్చేందుకు ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల మంజూరు చేశారు. నంద్యాల మెడికల్ కళాశాల నిర్మాణానికి ఎంతమంది అవాంతరాలు, అడ్డంకులను సృష్టించినా వాటిని అధిగమించి వైద్య విద్య వైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ, ఏపీఎంఎస్ఐడీసీ మేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి ఇటీవల మెడికల్ కళాశాల నిర్మాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే స్థానిక శాసనసభ్యుడు శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి కళాశాల నిర్మాణ పనులను పలుమార్లు పరిశీలించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ జూన్‌లో 2023–24 వైద్య విద్యా సంవత్సరానికి సంబంధించి 150 సీట్లను మంజూరు చేస్తూ బోధనా తరగతులు ప్రారంభం చేసుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ నెలలో ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించేందుకు పనులను మరింత వేగవంతం చేశారు.

సీట్ల భర్తీ ఇలా..

కళాశాలకు మొత్తం 150 సీట్లకు అనుమతి రాగా.. వీటిలో మొదటి విడత కౌన్సెలింగ్‌లో 64 మంది విద్యార్థులు నంద్యాల మెడికల్ కళాశాలను ఎంపిక చేసుకున్నారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు సీట్లు ఆల్ ఇండియా కోటలో ఎంపిక చేసుకున్నారు. 64 మంది విద్యార్థులు మెడికల్ కళాశాలలో రిపోర్ట్ చేశారు. ఇంకా 86 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్లు ఏబీసీ కేటగిరీలో కేటాయించనున్నారు. రెండవ విడత కౌన్సెలింగ్ పూర్తయ్యే సమయానికి అన్ని సీట్లు భర్తీ అవుతాయని అధికారులు చెబుతున్నారు. అలాగే మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం కూడా పూర్తయ్యింది. అన్నీ విభాగాలకు హెచ్‌ఓడీలను సైతం నియమించారు.

50.93 ఎకరాల్లో రూ. 475 కోట్లతో..

నంద్యాలలో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం 50.93 ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో చేపట్టింది. జీప్లస్ 3 ఫ్లోరలతో నిర్మించే కళాశాల భవనంలో అధునాతన సౌకర్యాలను కల్పిస్తోంది. అవసరమైన అన్ని హంగులతో కూడిన సదుపాయాలను కల్పిస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, డిపార్టుమెంటల్ బ్లాక్, కంట్రోల్ అండ్ డిజిటల్ లైబ్రరీ బ్లాక్, ఎగ్జామినేషన్ బ్లాక్, లెక్చరర్ గ్యాలరీ, డైనింగ్ హాల్, వ్యాయామ శాల, విద్యార్థులకు, సిబ్బందికి విడివిడిగా సువిశాలమైన కాఫీటేరియా, బయో కెమిస్ట్రీ, అనాటమీ తదితర ల్యాబోరేటరీలు, మ్యూజియంలను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు. నిర్మాణ పనులు 95 శాతానికిపైగా పనులు పూర్తి చేసుకున్నాయి. బాలికల, బాలుర హాస్టళ్లు అన్నీ వసతులతో సిద్ధమయ్యాయి. సీట్ల అలాట్‌మెంట్‌కు సంబంధించిన ప్రక్రియ కూడా కొనసాగుతోంది.

సర్వం సిద్ధం



కేంద్ర ప్రభుత్వం నుంచి మెడికల్ కళాశాల ప్రారంభానికి అన్ని అనుమతులు వచ్చాయి. 150 సీట్లతో ఎంబీబీఎస్ తరగతులు మొదలు పెట్టేందుకు సిద్ధం అవుతున్నాయి. మొదటి విడత కౌన్సిలింగ్‌లో భాగంగా 64 మంది విద్యార్థులు నంద్యాల వైద్యకళాశాలను ఎంపిక చేసుకున్నారు. రెండవ విడత కౌన్సిలింగ్‌లో మిగిలిన అన్ని సీట్లు భర్తీ అవుతాయి. అడ్మిషన్స్ పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

– డాక్టర్ స్వర్ణలత, ప్రిన్సిపాల్, నంద్యాల

పొల్యూషన్ ఫ్రీ క్యాంపస్



కళాశాల ప్రాంతాన్ని పొల్యూషన్ ఫ్రీ క్యాంపస్‌గా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇందులో భాగంగా కళాశాలలోని ప్రతి విద్యార్థి, సిబ్బందితో ఒక చెట్టు నాటించి వాటి సంరక్షణకు వారే తగిన చర్యలు తీసుకునేలాగా వారిని ప్రోత్సాహిస్తాం. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు అన్నీ రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ ఆనందకుమార్, వైస్ ప్రిన్సిపాల్, నంద్యాల

సుందరీకరణ వేగవంతం చేయండి



బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైద్య కళాశాల భవనాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెప్టెంబరు 1 నుంచి వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం బోధనా తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మిగిలి ఉన్న సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. మొదటి సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సౌకర్యాల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజి ల్యాబ్‌లను సందర్శించి కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు.

దోమల వ్యాప్తి అరికడితే వ్యాధుల నివారణ



సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): దోమల వ్యాప్తిని అరికడితే డెంగీ, మలేరియా వంటి ప్రాణాంత వ్యాధులను నివారించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆదివారం స్థానిక ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల వల్ల మలేరియా వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వస్తుందని సర్ రోనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20వతేదీన కనుగొన్నారని తెలిపారు. ఇందుకు గాను ఆయనకు 1902లో నోబెల్ బహుమతి కూడా ప్రదానం చేశారన్నారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు మాట్లాడుతూ దోమలు పుట్టకూడదు...దోమలు కుట్టకూడదన్న నినాదాన్ని అమలు చేయడం కోసం ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెండి పల్లకీ, మూడు బంగారు కలశాల విరాళం



పల్లకి, కళశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయానికి మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, జయమ్మ దంపతులు వెండి పల్లకీ, బంగారు పూత పూసిన మూడు రాగి కలశాలను విరాళంగా ఆదివారం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. వెండి పల్లకీ రూ. 27లక్షలు, కలశాలు రూ. 2 లక్షలు.. మొత్తం రూ. 29లక్షల విలువైన వాటిని ఎమ్మెల్యే దంపతులు ఈరన్నస్వామి ఆలయానికి విరాళంగా అందజేశారని వారు చెప్పారు. పల్లకీ, కలశాలకు ఆలయ అర్చిగేట్ ముఖద్వారం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చిగేట్ నుంచి దేవాలయం వరకు పల్లకీని అర్చకులు, ట్రస్టు బోర్డు సభ్యులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి మోసి భక్తిని చాటుకున్నారు. వివిధ పూజల అనంతరం పల్లికీని, కలశాలను దేవాలయం వారు స్వాధీనం చేసుకున్నారు.

నేడు కలశాల ప్రతిష్ఠాపన

సోమవారం తెల్లవారు జామున 4.20గంటలకు స్వామివారి మకర తోరణముపైన మూడు బంగారు కలశాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. శ్రావణమాసం చివరి సోమవారం పల్లకీ మహోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. స్వామి వారికి కోసిగి మండలం కందకూర వద్ద తుంగభద్ర నదిలో ప్రత్యేక స్నానాలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం పల్లకీ ఉరుకుందకు చేరుకుంటుందన్నారు. గతంలో ఉన్న పల్లకీ టేకుతో కూడిన చెక్కది కావడంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దంపతులు పూర్తిగా వెండితో పల్లకీని చేయించి విరాళంగా అందజేశారన్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు, ట్రస్టుబోర్డు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ముఖ్య అర్చకులు శివన్నస్వామి, నాగరాజ్‌స్వామి, ఆలయ పర్యవేక్షకులు రామ్మోహన్, వెంకటేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

డోన్‌లో చైన్ స్నాచింగ్



బాధితురాలు అనసూయను విచారిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: పట్టణంలో ఆదివారం గుర్తు తెలియని అగంతులకు రెండు చోట్ల చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. పట్టణంలోని అంబాభవానీ ఐస్‌క్రీం ఫ్యాక్టరీ వీధిలో అనసూయ అనే గృహిణి ఇంటి ముందర కల్లాపి చల్లుతోంది. ఆ సమయంలో ఒక వ్యక్తి వచ్చి అడ్రస్సు అడుగుతున్నట్లు నటిస్తూ మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు చైన్ లాక్కొని అప్పటికే పల్సర్ బైకుపై సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలసి ఉడాయించాడు. కొద్ది సేపటికి తారకరామ నగర్‌లో కిరాణం దుకాణంలో సిగరెట్లు కొనుగోలు చేస్తున్నట్లు నటించి దుకాణ యజమాని మహాలక్ష్మి మెడలో ఉన్న బంగారు చైన్‌ను తెంపేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించింది. ఈ క్రమంలో చైన్ తెగి కొంత భాగంగా దొంగ చేతికి చిక్కడంతో ఉడాయించాడు. తెగిపోయిన చైన్ తులం ఉండవచ్చునని బాధితురాలి తెలిపింది. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఇదే తరహాలో పల్సర్ బైకుపై వరుసగా ఒకే రోజు అనంతపురం, డోన్ పట్టణం, బేతంచెర్ల, కర్నూలు నగరాల్లో చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. వారే మళ్లీ ఈ చోరీల కు పాల్పడి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హడలెత్తిస్తున్న చిరుతలు

- భయాందోళనలో గ్రామస్తులు



కొండపై చిరుతపులి వదిలేసిన జంతు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

డోన్ టౌన్: చనుగొండ్ల, ఇందిరాంపల్లె గ్రామ సమీపంలోని కొండల్లో రెండు రోజులుగా చిరుత పులి సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. శనివారం సాయంత్రం ఇందిరాంపల్లె, తుగ్గలి మండలం రాంకొండ గ్రామాల మధ్యలో ఉన్న కొండ ప్రాంతంలో చిరుత పులి ఉన్న విషయాన్ని పసిగట్టిన కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. వ్యవసాయ పనులకు, పశువుల, గొర్రెల మేత మేపడానికి వెళ్లే వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. చిరుత సంచరిస్తున్న గ్రామాల్లో ఆదివారం డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది పర్యటించారు. చిరుత పాదముద్రలు సేకరించే ప్రయత్నం చేశారు. పొలాలకు గుంపులుగా వెళ్లాలని, పని చేసే చోట అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళ పొలాల్లో ఉండాల్సి వస్తే సమీపంలో మంటలు వేసుకోవాలన్నారు. 2012 ఫిబ్రవరిలో చనుగొండ్ల సమీపంలో గొర్రెల మందపై దాడి చేసేందుకు వచ్చిన చిరుతపై ఊర కుక్కలు తిరగబడి చంపేశాయి. కాగా ఈ సంఘటనలో ఆ గ్రామానికి చెందిన 70 మందిపై కేసు నమోదు కాగా కోర్టుల చుట్టు తిరగాల్సి వచ్చింది.

పందిర్లపల్లె పొలాల్లో చిరుతల సంచారం

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతానికి సమాంతరంగా ఉన్న పొలాల్లో చిరుతల సంచారం అధికమైంది. దీంతో వ్యవసాయ పనుల నిమిత్తం అటువైపు వెళ్లేందుకు రైతులు, వ్యవసాయ కూలీలు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం చలమ రేంజ్ రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురం గ్రామ పొలిమేరలో ఓ చిరుత సంచరించినట్లు గ్రామస్తులు గుర్తించారు. తాజాగా ఆదివారం ఉదయం రుద్రవరం రేంజ్ పెద్దకంబలూరు మజరా పందిర్లపల్లె పొలాల్లో రెండు చిరుతలు సంచరించినట్లు అటువైపు రైతులు గమనించారు. పొలాల్లో వాటి పాదముద్రలను గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. చిరుతలను పొలాల్లోనుంచి అడవిలోకి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం తెలుగుగంగ ద్వారా నీరు పారుతుండటంతో అటువైపు వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు, కూలీలు ఉదయాన్నే పొలాలకు వెళ్లాల్సి ఉంది. అయితే, చిరుతల సంచారం నేపథ్యంలో పందిర్లపల్లె కూలీలు గ్రామానికి సమీపాన ఉన్న పొలాల్లోకి నేరుగా కాలినడకన వెళ్లలేక ఆటోద్వారా పెద్దకంబలూరు వైపు నుంచి తిరిగివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా దీనిపై రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడుని వివరణ కోరగా చిరుతల జంట సంచరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెంటనే సిబ్బందిని అటువైపు పంపి పొలాల్లో బాణాసంచా పేల్చి శబ్దం చేయించి చిరుతలు అడవిలోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

బాలుడి కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు



కిడ్నాప్‌కు గురైన బాలుడు నిరంజన్



పోలీసుల అదుపులో నిందితులు

ఆలూరు: తెలంగాణ బాలుడి కిడ్నాప్ కేసును ఆలూరు పోలీసులు ఛేదించారు. నిందితులు అదే రాష్ట్రానికి చెందిన వారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా కర్తల్ గ్రామానికి చెందిన లక్ష్మి నర్సరీలు నిర్వహిస్తారు. ఆమె కుమారుడు నిరంజన్ కూనూరు గ్రామంలో నిర్మమయ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఉదయం స్వగ్రామంలోని నర్సరీలో మొక్కలకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. కొద్దిసేపటికి మీ కుమారుడిని కిడ్నాప్ చేశామని, తమకు రూ. 2 కోట్లు ముట్టజెప్పితే వదిలేస్తామని లేకపోతే చంపేస్తామని కిడ్నాపర్లు బసవరాజ్, భజరంగం, చిలుకూరిశేఖర్, సాయికుమార్ నిరంజన్ తల్లికి ఫోన్ చేసి బెదిరించారు. భయంతో ఆమె వెంటనే కడల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పోలీసు స్టేషన్లకు కిడ్నాప్ సమాచారం చేరవేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలూరు ఎస్ఐ డాక్టర్ నాయక్ అంబేడ్కర్ సర్కిల్‌వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కేఏ 28ఎన్ 7535 నెంబర్ గల కారులో ప్రయాణిస్తున్న వారు అనుమానాస్పదంగా కనిపించారు. బాలుడి ముఖానికి ఫేస్ మాస్క్ ఉండటంతో ఆ బాలుడు ఎవరు అని ప్రశ్నించగా కిడ్నాపర్లు సరైన సమాధానం చెప్పకపోగా అక్కడే కారు వదిలి పరారయ్యేందుకు యత్నించారు. అప్రమత్తమైన ఎస్ఐ, పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. డబ్బుకోసం తెలంగాణలో తాము బాలుడిని కిడ్నాప్ చేశామని ఒప్పుకున్నారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆలూరు పోలీసులను ప్రత్యేకంగా అభినందించారు. బాలుడు తమ వద్ద ఉన్నట్లు నిరంజన్‌తల్లి లక్ష్మికి సమాచారమిచ్చినట్లు ఎస్ఐ నాయక్ తెలిపారు.

నీటి సంపులో పడి వివాహిత మృతి

మంత్రాలయం రూరల్: ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడి ఓ వివాహిత మృతి చెందిన సంఘటన ఆదివారం మాధవరం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కటిక తబేరా (45) మధ్యాహ్న సమయంలో ఇంటి ముందు దుస్తులను ఉతుకుతుంది. ఇంటి నీటి అవసరాల కోసం నిర్మించుకున్న సంపులో నీటిని తోడేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. ఆ సమయంలో ఎవ్వరు లేకపోవడం, మహిళకు ఈత రాకపోవడంతో మరణించినట్లు తెలుస్తోంది.

యువకుడి ఆత్మహత్య



స్టీఫెన్ (ఫైల్)

వెలుగోడు: పట్టణంలో ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన పెయింటర్ తిమోతి, హెప్సిబా దంపతుల ఏకైక కుమారుడు స్టీఫెన్ (19) ఓపెన్ డిగ్రీలో సెకండియర్ చదువుతున్నాడు. చదువులో రాణించలేకపోవడంతో ఉద్యోగం రాదేమోనని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో రెండు రోజులుగా చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆదివారం ఉదయం స్టీఫెన్ మృతదేహం వెలుగోడు రిజర్వాయర్‌లో లభ్యమైంది. ఒక్కగానొక్క కుమారుడు అకాల మరణం పొందడంతో తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలు దాటుతూ మృత్యువాత



మృతిచెందిన బోయ నాగకృష్ణ

కర్నూలు: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం తాటిపాడు గ్రామానికి చెందిన బోయ నాగకృష్ణ (36) మృతిచెందాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే ఈయన పెద్ద భార్య కృష్ణవేణి 11 సంవత్సరాల క్రితం మృతిచెందింది. దీంతో ఉలిందకొండ మండలం కొంగనపాడు గ్రామానికి చెందిన కళ్యాణిని రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ఒకరు, రెండో భార్యకు ఇద్దరు కుమార్తెలు సంతానం. ఆదివారం ఉలిందకొండలో పెళ్లి వేడుకలకు వచ్చి బహిర్భూమికి వెళ్లి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పీఎస్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని హైవే 44పై శనివారం రాత్రి ట్రాలీ ఆటో ఢీకొని బేతంచెర్ల మండలం వెంకటగిరికి చెందిన బోయ వెంకటస్వామి (35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బోయ వెంకటస్వామి కర్ణాటక ప్రాంతాల్లో పాలిష్ కటింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి సంఘటనా ప్రాంతంలోని హోసన్నా మందిరం సమీపంలో రోడ్డు దాటుతుండగా అదే సమయంలో డోన్ వైపు నుంచి వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య రాజేశ్వరి, ఇద్దరు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అభినందన

కర్నూలు (న్యూసిటీ): ఏషియన్ సాఫ్ట్‌బాల్ సీనియర్, జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పలువురు రాష్ట్ర క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.జాకీర్ హుస్సేన్ అభినందించారు. ఆదివారం కర్నూలు డిస్ట్రిక్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా నుంచి కె. కల్యాణి, పి. గౌతంరాజు, ఆర్. మేఘన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ కార్యదర్శి కొమ్మువారి విజయ్‌కుమార్, జాయింట్ కార్యదర్శి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎన్.జాకీర్ హుస్సేన్